## క్లుప్తంగా

### పటిష్ట గస్తీ నిర్వహించండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

**బుచ్చినాయుడుకండ్రిగ:** అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపడంతోపాటు పటిష్టంగా గస్తీ నిర్వహించాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఆదేశించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలు, గదులు, రికార్డులు, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ ఇత్యాది వాటిని పరిశీలించి మాట్లాడారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, తగాదాలు లేకుండా కౌన్సెలింగ్ ఇచ్చి ప్రశాంతమైన వాతావరణం ఉండేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. పాత, కొత్త నేరస్తులు, అనుమానితులు, కదలికలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు చెక్ పెట్టాలన్నారు. పోలీసుస్టేషన్‌కు అందే ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారణ చేయాలని, బ్లూ కోల్ట్స్, రక్షక వాహనాలతో నిరంతరం గస్తీ నిర్వహించేటట్లు నైట్ బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. డయల్ 112 ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

### పోగొట్టుకున్న బైక్ అప్పగింత

**శ్రీకాళహస్తి:** ద్విచక్ర వాహనం పోగొట్టుకున్న వ్యక్తికి శుక్రవారం శ్రీకాళహస్తి 1వ పట్టణపోలీసులు తిరిగి అందజేశారు. ఇటీవల తిరుచానూరుకు చెందిన సురేష్ ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్, నగదు రూ.1,500 పోగొట్టుకున్నాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేసి వాటిని పట్టుకుని శుక్రవారం బాధితునికి అప్పగించారు. దీంతో అతను పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

### రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న దామోదర్‌నాయుడు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తి మోటారు వాహన తనిఖీ కార్యాలయంలో రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోటారు వాహన తనిఖీ అధికారి దామోదర్‌నాయుడు మాట్లాడుతూ ఫిబ్రవరి 15వ తేదీ వరకు ఈ మాసోత్సవాలు ఉంటాయని చెప్పారు. అతివేగం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడమే కారణమన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్ర యాణించే వారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు.

### వైభవంగా వార్షికాభిషేకం



కలశాలతో ప్రదర్శన చేస్తున్న అర్చక బృందం

**నాగలాపురం:** మండలంలోని సురుటుపల్లిలోని ప్రసిద్ధి గాంచిన శ్రీ సర్వమంగళ సమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేకం జరిగి ఆరేళ్లు పూర్తి కావడంతో శుక్రవారం ఆరవ సంవత్సరాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చెన్నైకు చెందిన చంద్రశేఖర్ గురుక్కల్ తన 11 మంది శిష్య బృందంతో కలిసి విఘ్నేశ్వర పూజ, రుద్రపారాయణంతో ప్రారంభించి పూర్ణాహుతి, కలశాభిషేకం, రుద్ర, త్రిశక్తి అర్చనలు నిర్వహించారు. అనంతరం మహాదీపారాధన తర్వాత భక్తులకు దర్శనం కల్పించి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లత పర్యవేక్షించారు. సంవత్సరాభిషేకానికి సత్యవేడుకు చెందిన పరమశివం, తిరునీలకంఠం కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆగమ పాఠశాల వేద పండితులు, ప్రధాన అర్చకులు కార్తికేశన్, సతీశ్ శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### గౌరమ్మ నిమజ్జనం



గొబ్బిళ్లు తడుతున్న మహిళలు

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శుక్రవారం గౌరమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి నెల పాటు మహిళలు ప్రతిరోజూ సాయంత్రం గ్రామంలో గౌరమ్మ దేవత ప్రతిమను ఏర్పాటు చేసి గొబ్బిళ్లు తట్టి, భక్తిపాటలు పాడారు. పండుగల చివరి రోజైన ఏడాది పండుగ రోజు గౌరమ్మను నిమజ్జనం చేస్తారు. స్థానిక నాలుగువీధుల్లో మహిళలు పూజలు చేశారు. వినాయక వీధి, దేవాలయంవీధి, తూర్పుమిట్ట వీధుల్లో అన్నదానం చేశారు. అనంతరం గౌరమ్మ ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జన చేశారు. తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



పెద్ద పాండూరులో శ్మశానవాటిక దారి కోసం విన్నవిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

- పై చిత్రంలో కనిపిస్తున్న వారు వరదయ్యపాళెం మండలం పెద్ద పాండూరు పంచాయతీ కొత్త దళితవాడకు చెందిన గ్రామస్తులు. దళితవాడ శ్మశానవాటిక దారి కోసం పెద్ద పాండూరు రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు తహసీల్దార్‌కు సమస్యను నివేదించారు. ఏళ్ల కాలంగా ఉన్న సమస్య సదస్సుతో అయినా పరిష్కారమవుతుందని ఆశపడినా ఇప్పటివరకు ఆ ఊసే లేదు.

# పరిష్కారమేదీ.. ప్రదక్షిణలే!

- మొక్కుబడిగా రెవెన్యూ సదస్సులు
- వందల సంఖ్యలో అర్జీలు
- 40 రోజుల్లోపు పరిష్కరించాలని ప్రభుత్వ ఆదేశం
- ఇప్పటికి 10శాతం అర్జీలను కూడా పరిష్కరించని వైనం



అంబూరు రెవెన్యూ సదస్సులో ఇంటి స్థలాల కోసం గిరిజనుల విన్నపం (ఫైల్)

**వరదయ్యపాళెం:** రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే వాస్తవ పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. భూ సమస్యలపై వందలాది ఫిర్యాదులు అందినా పరిష్కారం అంతంత మాత్రంగానే ఉండడంతో బాధితులు మళ్లీ తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్



వరదయ్యపాళెం మండలం కోవూరుపాడు రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇస్తున్న స్థానికులు (ఫైల్)

కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలకు పరుగులు తీస్తున్నారు.

#### 2326 అర్జీలు

సత్యవేడు నియోజకవర్గంలో వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో గత డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 2326 అర్జీలు అందాయి. మ్యుటేషన్, సర్వే, కొలతల్లో వ్యత్యాసం, అడంగల్‌లో మార్పులు, నూతన పాసుపుస్తకాలు పేర్ల మార్పిడి, ఆక్రమణలు, వారసత్వం, రేషన్ కార్డులు, నివేశ స్థలాలు కోసం.. ఇలా పలు సమస్యలపై ప్రజలు అర్జీలు ఇచ్చారు. అయితే వీటిలో కేవలం 780 దరఖాస్తులను మాత్రమే పరిష్కరించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మరో 1,546 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడం గమనార్హం!

#### మొక్కుబడి సదస్సులే

కూటమి ప్రభుత్వం మాటలు నమ్మి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు పెద్దఎత్తున అర్జీలను ఇచ్చారు. దీర్ఘకాలిక భూ సమస్యలపైనే అర్జీలు ఎక్కువగా వచ్చాయి. కొన్ని సమస్యలను పరిష్కరించే అవకాశం ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని బాధితులు వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పని లేకుండా రెవెన్యూ సదస్సులతో సమస్యలు తీరుతాయని రైతులు ఆశించారు. అయితే అధికారులు పెద్దగా శ్రద్ధ చూపకపోవడంతో సదస్సులు తూతూమంత్రంగా కొనసాగాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అర్జీల పరిష్కారానికి 45 రోజుల గడువు విధించడంతో మళ్లీ తహసీల్దార్ కార్యాలయాల్లో వీఆర్వోలు, సర్వేయర్ల చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేయక తప్పదని వాపోతున్నారు.

#### అర్జీలకు రశీదులూ లేవు!

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీకీ రశీదులు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అయితే అధికారులు ఎలాంటి రశీదులు ఇవ్వకుండా అర్జీలు తీసుకుని వెళ్లారు. దీంతో తమ అర్జీల పరిస్థితి ఏమిటో తెలియడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన భూ సమస్యలకు పరిష్కారం చూపాలని బాధితులు కోరుతున్నారు.

#### అర్జీల వివరాల్లో గోప్యత

గ్రామసభల్లో వచ్చిన అర్జీల వివరాలను సైతం పూర్తిస్థాయిలో లెక్కలు చెప్పకుండా కొన్నింటిని మాత్రమే ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. 45 రోజుల్లోపు రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్దేశిత గడువు విధించింది. ఈ నిబంధనతో సమావేశాల్లో వచ్చిన అర్జీల సంఖ్యను పూర్తిగా ప్రభుత్వానికి చూపలేదు. కేవలం పరిష్కారానికి నోచుకునే అర్జీల వివరాలను మాత్రమే జిల్లా అధికారులకు తెలిపినట్లు సమాచారం.

**సత్యవేడులో రెవెన్యూ సదస్సుల సమాచారం**

| మండలం | వచ్చిన అర్జీల సంఖ్య | పరిష్కారం | పెండింగ్ |
|---|---|---|---|
| బుచ్చినాయుడుకండ్రిగ | 535 | 269 | 266 |
| వరదయ్యపాళెం | 235 | 70 | 165 |
| సత్యవేడు | 178 | 56 | 122 |
| నారాయణవనం | 267 | 59 | 208 |
| నాగలాపురం | 229 | 132 | 97 |
| పిచ్చాటూరు | 198 | 14 | 184 |
| కేవీబీపురం | 684 | 160 | 504 |

### పంట నమోదు తప్పనిసరి



కళత్తూరులో వరి పంటను పరిశీలిస్తున్న సత్యవేడు ఏడీఏ సుబ్రమణ్యం, ఏఓ గౌరి

**వరదయ్యపాళెం:** మండలంలోని రైతులందరూ విధిగా రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా పంట నమోదు చేసుకోవాలని ఏఓ గౌరి కోరారు. శుక్రవారం మండలంలోని కళత్తూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ సుబ్రమణ్యం రైతులతో మాట్లాడారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. వరి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

### మాజీ ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

**రేణిగుంట(ఏర్పేడు):** ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరుకు చెందిన వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్ రెడ్డి చిన్నాన్న గున్నేరి రామిరెడ్డి(80) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారమందుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శుక్రవారం అక్కడకు ఎండీ పుత్తూరుకు చేరుకుని ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మండల పార్టీ ఇన్‌చార్జి గున్నేరి కిషోర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు కూనాటి రమణయ్య యాదవ్, సర్పంచ్ మోహన ప్రియ, మండల పార్టీ నాయకులు నివాళులర్పించారు.

## చిరస్మరణీయుడు శ్రీకృష్ణదేవరాయలు



శ్రీకృష్ణదేవరాయలుకు నివాళులర్పిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి:** ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు శ్రీకృష్ణదేవరాయలు అని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని రాజగోపురం వద్ద శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పులమాలలు వేసి నివాళులర్పించారు. అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల జీవనం కోసం చెరువులు నిర్మించడం, ఆధ్యాత్మిక చింతన కోసం ఆలయాలు ఏర్పాటు చేయడం, రాజనీతిజ్ఞతో పరిపాలన చేసిన శ్రీకృష్ణదేవరాయలు ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేశారన్నారు. నేటి యువత ఆయన స్ఫూర్తితో సమాజ హితం కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, స్వర్ణ మూర్తి, అంజూరు వెంకటేష్‌బాబు, కంఠా ఉదయ్ కుమార్, ఉత్తరాజి శరవణకుమార్, సెన్నీరుకుప్పం శేఖర్, మస్తాన్, సురేష్, వల్లం గోపి, పత్తి మణి, మున్నా రాయల్, ఈశ్వరయ్య, కొట్టే నరేష్, అంజూరు కృష్ణ, గంగాధరం, సుబ్బారావు, గోపి, జొన్నగడ్డల రవి పాల్గొన్నారు.

### ముక్కంటి సేవలో ఎమ్మెల్యేలు



ఆలయం వద్ద ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గురజాల జగన్‌మోహన్

**శ్రీకాళహస్తి:** జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నూతన హంగులు



పనులు పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఓ

**శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట):** రేణిగుంట మండలం మామండూరు పర్యాటక కేంద్రం ముఖద్వారానికి శుక్రవారం నూతన హంగులతో ముస్తాబు చేస్తున్నారు. పీఎస్ఎస్ చైర్మన్ కుమారస్వామి, డీఆర్‌ఓ షేక్ గౌస్ కరీం పెయింటింగ్ పనులను పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ పర్యాటక కేంద్రానికి అధిక సంఖ్యలో సందర్శకులు వస్తున్నారని చెప్పారు. అందుకు అనుకూలంగా పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. పర్యాటకుల భద్రతను దృష్టిలో పెట్టుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

## గౌరమ్మకు పూజలు



నరసరాజు అగ్రహారంలో గొబ్బెమ్మ పూజలు చేస్తున్న మహిళలు

**సత్యవేడు:** మండలంలోని నరసరాజు అగ్రహారంలో శుక్రవారం గౌరమ్మ(గొబ్బెమ్మదేవత)ను కొలువుంచి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అమ్మవారిని బంగారు నగలు, నూతన వస్త్రాలతో అలంకరించారు. సాయంత్రం గ్రామంలోని చెంగాలమ్మ పరమేశ్వరి సంఘం, స్త్రీనిధి గ్రూపు, శ్రీ సాయి, వెంకయ్యస్వామి, శ్రీజ్యోతి, గంగమ్మ, చెంగాలమ్మ మహిళా సంఘాలకు చెందిన మహిళలు కలసి నడివీధిలో గొబ్బెమ్మను కొలువుదీర్చారు. పాటలు పాడుతూ గొబ్బిలు తట్టారు. మహిళలు అమ్మవారి విగ్రహాన్ని మోస్తూ గ్రామ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. అంతకు ముందు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

## కుష్ఠు రహిత సమాజమే లక్ష్యం



కుష్ఠు వ్యాధి నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి దివాకర్

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించనున్న కుష్ఠు వ్యాధిగ్రస్తుల సర్వేను జయప్రదం చేయాలని వైద్యాధికారి దివాకర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు, మగ వలంటీర్లకు కుష్ఠు వ్యాధి సర్వేపై అవగాహన సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని,. చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, బత్తాయి తొక్కలా ఉండడం, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు ఎక్కడం..వంటి అనుమానిత లక్షణాలు ఉన్న పక్షంలో వారిని పీహెచ్‌సీకి తీసుకురావాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా యండీటీ మందులను పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**రేణిగుంట:** అమర రాజా సంస్థల చేయూతతో, రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా దిగువమాఘం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమర రాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకి ఉచిత శిక్షణనిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. అభ్యర్థులకు శిక్షణ సమయంలో ఉపకార వేతనం పూర్తయ్యాక, ఉద్యోగావకాశం పొందేందుకు మొదటి బ్యాచ్‌కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులకు సర్ఫేస్ మౌంట్ టెక్నాలజీ, పీసీబీ అసెంబ్లీ ఆపరేటర్ కోర్సుల్లో 24 నెలలు (3 నెలలు ట్రైనింగ్ సెంటర్లో, 21 నెలలు కంపెనీ లో) శిక్షణనిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో నెల కు రూ.12,072 ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు యాజమాన్యం తెలిపారు. ఈ నెల 20వ తేదీన దిగు వమాఘం గ్రామంలోని అమర రాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఇంటర్వ్యూ జరుగుతుందన్నా రు. 10వ తరగతి, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 87126 08589, 97392 90499, 88072 26264 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

### చేపల పెంపకానికి చెరువు వేలం

**రేణిగుంట(ఏర్పేడు):** ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరు చెరువులో చేపల పెంపకానికి శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మోహన ప్రియ అధ్యక్షతన అధికారులు వేలం పాటను నిర్వహించారు. గ్రామానికి చెందిన గోపాల్ రూ.40వేలకు చెరువులో చేపలు పెంపకానికి వేలంపాటలో దక్కించుకున్నారు. పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, విజయకుమార్ పాల్గొన్నారు.

### ఆ చెరువులో చేపల పెంపకం వద్దు

**సత్యవేడు:** వీఆర్ కండ్రిగ చెరువులో చేపల పెంపకానికి అనుమతించరాదని చెరువు ఆయకట్టు కమిటీ అధ్యక్షుడు శ్రీరాం గోవిందరాజులు శుక్రవారం ఆయకట్టు కమిటీ చైర్మన్, ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతి పత్రం ఇచ్చారు. చేపల పెంపకానికి అనుమతి ఇస్తే లీజుదారులు ఇష్టాను సారంగా చెరువు నీటిని వెలుపలకు వదిలేస్తుండడంతో చెరువు ఆయకట్టు కింద సుమారు సాగు అవుతున్న 500 ఎకరాలలో పంటలకు నీటి వసతి కోల్పోతున్నారని, అంతేకాకుండా చేపలు పెంపకందారులు చెరువు నీటిలో కలిపే చేపల దాణా వల్ల నీరు కలుషితమై పంటలు పూర్తి స్థాయిలో దిగుబడులు రావడం లేదని సమస్యలు నివేదించారు. కార్యక్రమంలో మదనంబేడు చెందిన వెంకటేష్, ఆయకట్టు మాజీ చైర్మన్ సంపత్ కుమార్, మాచా బాలయ్య, ఎస్. రామారావు, ఎస్.మునికృష్ణ, రాజేష్, ఎస్.కౌశిక్ పాల్గొన్నారు.

### ఘనంగా హరిహరేశ్వరస్వామి కుంభాభిషేకం

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న పనసకోనలోని హరిహర తీర్థంలో వెలసిన హరిహరేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఆలయాన్ని పునర్నిర్మించారు. దీంతో ఆలయంలో శుక్రవారం ముందుగా కలశస్థాపన చేసి వేదపండితులు పూజలు నిర్వహించారు. మరో రెండురోజుల పాటు ఈ పూజలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

### వేమాలమ్మకు పొంగళ్లు



**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని కనమనంబేడు గ్రామదేవత వేమాలమ్మకు శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి ఘనంగా పొంగళ్లు పెట్టారు. మొక్కులు చెల్లించారు. ప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు.



పొంగళ్లు పెడుతున్న గ్రామస్తులు

## అభాగ్యులకు ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు అందిస్తున్న యువతేజ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ కరీముల్లా

**శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట):** రేణిగుంట రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఉన్న అభాగ్యులకు శుక్రవారం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. తిరుపతికి చెందిన యువతేజ ట్రస్ట్, వికృతమాల వద్దనున్న లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా సుమారు 100 మందికి ఆహారం పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువతేజ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ కరీముల్లా, లక్ష్మీ నరసింహ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు సైదమ్మ, కార్యదర్శి రాజేష్, సభ్యులు పద్మజ, సంపత్ పాల్గొన్నారు.

## వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయండి



రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత సంఘాల నాయకులు, క్రైస్తవ మత పెద్దలు

**శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట):** గిరిజన తెగల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టిన వారిపై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం రేణిగుంటలోని బేతేలు ప్రార్థన మందిరంలో దళితులు, క్రైస్తవ మత పెద్దలతో గిరిజన సంఘం మండల నాయకురాలు ఈశ్వరమ్మ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు జె.తులసిరాజన్, ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్, క్రైస్తవ సంస్థల ఐక్యవేదిక నాయకులు పాస్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ గిరిజనుల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టిన బీజేపీ స్థానిక నాయకుడు చంద్రశేఖర్ రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రేణిగుంట పోలీస్ అధికారులు క్రైస్తవ గిరిజన కుటుంబాలకి అండగా నిలిచి నిందితులపై కేసు నమోదు చేయాలని, లేని పక్షంలో క్రైస్తవ గిరిజన బాధితులకు అండగా నిలబడి మా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో మురళి, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చీరాలయ్య, క్రైస్తవ సంస్థల ఐక్య వేదిక నాయకులు జాన్ బాబు, నాగరాజు, ఆశీర్వాదం, పరమానందం, ప్రసాద్, నథానియేలు, థామస్, చిన్నబ్బా, బాధితుడు పాస్టర్ అశోక్, గిరిజనులు పాల్గొన్నారు.